నల్లగొండ జిల్లా పెద్దకాపర్తిలో నిమ్మతోటకు ట్యాంకర్‌తో నీళ్లు పెడుతున్న రైతు రవీందర్‌రెడ్డి

యాదాద్రి భువనగిరి జిల్లా బోగారంలో వరి పొలానికి ట్యాంకర్‌తో నీరు పెడుతున్న రైతు

పొలానికి ట్యాంకర్ నీరే దిక్కు

పంటలు ఎండుతున్నాయని అన్నదాతల ఆందోళన

- ప్రత్యామ్నాయం వైపు పరుగు
- నల్లగొండ జిల్లాలో ఆగమాగం



నల్లగొండ జిల్లా త్రిపురారంలో ట్యాంకర్ ద్వారా పొలానికి నీళ్లు వదులున్న రైతు శ్రీనివాస్

త్రిపురారం/చిట్యాల/రామన్నపేట, మార్చి 3 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాగు నీరు లేక పంటలు ఎండిపోతుండటంతో రైతులు ఆగమాగం అవుతున్నారు. ప్రత్యామ్నాయం వైపు పరుగులు పెడుతున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి పొలాలకు పట్టిస్తున్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోనూ సాగునీటికి కష్టంగా మారింది. నల్లగొండ జిల్లా త్రిపురారం మండల కేంద్రానికి చెందిన నగిరి శ్రీనివాస్ తనకున్న నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాడు. బావి, బోరు ఉన్నా నీళ్లు సరిపోక నెల క్రితం పొలంలో మరో బోరు వేశాడు. రెండు బోర్లు, బావి ఉన్నా నీళ్లు అందక ఎకరం పొలం ఎండిపోతున్నది. ఈ క్రమంలో బెజ్జికల్ గ్రామానికి చెందిన రైతుకు రూ.2 వేలు చెల్లించి ఆదివారం ట్యాంకర్ నీటిని తెప్పించి పొలానికి పోయించాడు. 10 గుంటల మడికి ఐదు ట్యాంకర్ల నీరు పట్టాయని, అందుకు రూ.10 వేలు చెల్లించినట్టు రైతు శ్రీనివాస్ తెలిపాడు. ఎకరం పొలం తడవాలంటే దాదాపు 15 ట్యాంకర్ల నీరు అవసరమని ఆయన పేర్కొన్నాడు. అదీకాక ఉదయం నుంచి సాయంత్రం వరకు నడి ఎండలో కాపుకాసుకుంటూ పొలంలో ఉండాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామంలో మొదటిసారిగా ట్యాంకర్ ద్వారా తానే నీటిని పోయించానని తెలిపాడు. పంట చేతికొచ్చే సమయంలో నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని, ఇకనైనా ప్రభుత్వం స్పందించి సాగర్ ఎడమ కాల్వకు నీళ్లందించాలని కోరుతున్నాడు.

నిమ్మ తోటకూ ట్యాంకర్ నీరే..

నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్ద కాపర్తికి చెందిన రైతు గంట్ల రవీందర్‌రెడ్డి తన ఎకరంన్నర నిమ్మతోట నీళ్లు లేక ఎండిపోయే దశకు వచ్చింది. దాంతో ట్యాంకర్ ద్వారా నీళ్లు పెట్టి తోటను కాపాడే ప్రయత్నం చేస్తున్నాడు. దీనికోసం వారానికి రూ. 6,600 ఖర్చు చేస్తున్నట్టు రైతు తెలిపాడు. అదే రైతు 7 ఎకరాల్లో వరి వేయగా నీటి కొరత కారణంగా 3 ఎకరాలకు మాత్రమే నీరందుతుందని, మిగిలిన 4 ఎకరాలు ఎండి పోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

రామన్నపేట మండలంలోనూ..

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోనూ కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఆసిఫ్‌నెహర్ కాల్వ ద్వారా నీళ్లు రాకపోవడం, భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోరు, బావులు నీళ్లు పోయడం లేదు. దాంతో రైతులు పొట్ట దశకు వచ్చిన వరి పొలాలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. కొందరు రైతులు పొలాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించి తడుపుతున్నారు. ఆదివారం రామన్నపేట మండలం బోగారంలో రైతు ధనుంజయ రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేయగా నీళ్లు లేక పొలం ఎండిపోయే దశకు వచ్చింది. దాంతో పంటను కాపాడుకోవడానికి 20 రోజులుగా ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నాడు. రోజుకు రూ.2,500 ట్యాంకర్‌కే ఖర్చు చేస్తున్నట్టు ఆవేదన వ్యక్తం చేశాడు.

మద్దతు ధర మహాప్రభో!

- మార్కెట్‌లో అన్నదాత దగా
- కష్టాల్లో పత్తి, మిర్చి, పల్లి రైతులు
- ఆగ్రహంతో రోడ్డెక్కి ధర్నాలు
- ఉలుకూ పలుకూలేని సర్కారు
- బోనస్ ధరపై కాంగ్రెస్ యూటర్న్

మిర్చికి మద్దతు ధర ఇవ్వాలని ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్ ఎదుట ఆందోళన చేపడుతున్న రైతులు (ఫైల్)

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): మొన్నటివరకు పంటలను దర్జాగా మద్దతు ధరకు అమ్ముకున్న రైతులు ఇప్పుడు అదే మద్దతు ధర కోసం రోడ్డెక్కాల్సిన దుస్థితి. తమ పంటలను అమ్ముకునేందుకు నానా ఆగచాట్లు. మార్కెట్లలో పడిగాపులు. నిత్యం ఎక్కడో ఒకచోట ఆందోళనలు, ధర్నాలు. ముఖ్యంగా పత్తి, మిర్చి, వేరుశనగ రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నది. మార్కెట్లకు తెచ్చిన పంటకు ఆశించిన ధర దక్కకపోవడం, మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో ఆగ్రహంతో రగిలిపోతున్నారు. పలు జిల్లాల్లో రైతులు తమ పంటలను కొనుగోలు చేయాలని రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారు. మూడు రోజుల క్రితం మిర్చి రైతులు ఖమ్మంలో ధర్నా చేశారు. కేసముద్రం, మహబూబాబాద్ మార్కెట్‌లలో మిర్చి పంటను కొనుగోలు చేయకుండా అధికారులు, వ్యాపారులు రైతులను ఇబ్బంది పెడుతున్నారు. వేరుశనగకు గిట్టుబాట ధర కల్పించాలంటూ అచ్చంపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌లో రైతులు రొడ్డెక్కారు. పత్తిని కొనుగోలు చేయకుండా సీసీఐ అధికారులు ఇబ్బంది పెడుతున్నారంటూ ఆదిలాబాద్‌లో రైతులు ఆందోళన చేశారు. పత్తికి మద్దతు ధర చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వంలో కదలిక కనిపించడం లేదు. రైతుల ఆక్రందన అరణ్యరోదనగానే మిగిలిపోతున్నది.

బోనస్ ధర ఏమైంది?

తాము అధికారంలోకి వస్తే రైతులు పండించే ప్రతి పంటను కొనుగోలు చేస్తామని, 10 రకాల పంటలకు మద్దతు ధరతోపాటు క్వింటాలుకు రూ.300 నుంచి రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్నది. కానీ, బోనస్ ధర ఇప్పటికీ అమలులోకి రాలేదు. కనీసం పంటలకు మద్దతు ధర కూడా దక్కడం లేదు. ఇప్పటికే ధాన్యానికి మద్దతు ధరపై ఆ పార్టీ సీనియర్ నేత కోదండరెడ్డి నాలుక మడతేశారు. ధాన్యం ధర మద్దతు ధరకు తక్కువ ఉంటేనే బోనస్ ఇస్తామని, మద్దతు ధర దక్కితే బోనస్ ఇవ్వబోమని తేల్చి చెప్పారు. తాజాగా వ్యవసాయ శాఖ మంత్రి కూడా ఇదే విధంగా వ్యవహరించడం గమనార్హం. కాంగ్రెస్ ఇస్తామన్న బోనస్ గురించి మాట్లాడకుండా, మద్దతు ధర కోసం కేంద్ర సంస్థలకు లేఖలు రాస్తున్నారు. అంటే బోనస్ ఇవ్వబోమని పరోక్షంగా చెప్పారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం మిర్చి, పత్తి, పసుపు పంటలకు బోనస్ కల్పిస్తే రైతులు పడుతున్న ఇబ్బందులు ఎంతోకొంత తీరుతాయి. కానీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు మొదలుపెట్టకపోవడం బాధాకరం.

కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన పంటల వారీగా బోనస్ ధర
(క్వింటాలుకు రూపాయల్లో)

పంట	మద్దతు ధర	కాంగ్రెస్ హామీ ధర (బోనస్)
ధాన్యం	2,183	2,683 (500)
మొక్కజొన్న	1,870	2,200 (330)
కందులు	6,300	6,700 (400)
సోయాబీన్	3,950	4,400 (450)
పత్తి	6,025	6,500 (475)
మిర్చి	-	15,000
పసుపు	-	12,000
ఎర్రజొన్న	-	3,500
చెరుకు	-	4,000
జొన్నలు	2,758	3,050 (292)

6 నుంచి వస్త్రపరిశ్రమ నిరవధిక బంద్

పవర్‌లూం కార్మిక సంఘం నేత రవి

సిరిసిల్లలోని బీవైనగర్‌లో జెండా వద్ద వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజన్న సిరిసిల్ల, మార్చి 3 (నమస్తే తెలంగాణ): మరమగ్గాల వస్త్ర పరిశ్రమ ఈ నెల 6నుంచి తలపెట్టిన నిరవధిక బంద్‌ను విజయవంతం చేయాలని లాల్‌బావుటా చేనేత పవర్‌లూం కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పంతం రవి పిలుపునిచ్చారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీవైనగర్‌లో బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరిశ్రమకు రావాల్సిన రూ.270 కోట్లు వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. కార్మికులను యజమానులుగా చేస్తామన్న వర్కర్ టు ఓనర్ పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిధులు కేటాయించి కార్మికులకు శాశ్వత ఉపాధి కల్పించాలని అన్నారు. కార్మికులకు చేతినిండా పని ఉండాలంటే ఎప్పటిలాగే వస్త్ర ఆర్డర్లు సిరిసిల్లకు ఇవ్వడంతోపాటు యారన్ సబ్సిడీ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 6 నుంచి చేపడుతున్న నిరవధిక బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు అజ్జ వేణు, సీనియర్ నాయకులు నల్ల చంద్రమౌళి, నల్ల మార్కండేయులు, కొంక విజయ్, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన పలువురు ప్రజాప్రతినిధులు

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డిని పలువురు ప్రజాప్రతినిధులు ఆదివారం కలిశారు. భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్‌రావు ఆదివారం కుటుంబసమేతంగా సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వరంగల్ మేయర్ గుండు సుధారాణి సైతం సీఎంను కలిశారు. వారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సీఎం నివాసానికి వెళ్లారు. బీజేపీ నేత బంగారు శృతి సీఎంను ఆయన నివాసంలో కలిశారు. ఆమె నాగర్‌కర్నూల్ నుంచి బీజేపీ టిక్కెట్ ఆశించి, భంగపడిన నేపథ్యంలో సీఎంను కలవడం ప్రాధాన్యం సంతరించుకున్నది.

నీళ్లు ఇవ్వకుంటే ప్రత్యక్ష పోరాటం

- రెండు రోజుల్లో వదలాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల

వేల్పూర్, మార్చి 3: బాల్కొండ నియోజకవర్గంలో ప్రవహించే కప్పలవాగు, పెద్దవాగులో ప్యాకేజీ-21 ద్వారా ఏర్పాటు చేసిన అవుట్‌లెట్లతో నీరందించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కోరారు. ఆదివారం సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. వాగు పరీవాహక గ్రామాల రైతుల కోరిక మేరకు గడిచిన 20 రోజుల క్రితమే ఇరిగేషన్ సీఈతో ఫోన్‌లో మాట్లాడటమేగాక, నీళ్లు వదలాలని ఎమ్మెల్యేగా లేఖ అందజేసినట్టు చెప్పారు. అధికారులు కూడా సర్కార్‌కు ప్రతిపాదనలు పంపించామని, నీటి విడుదల విషయంలో ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెబుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా వాగుల్లోకి నీటిని వదలకపోతే ఆ రెండు వాగుల వెంట ఉన్న గ్రామాలకు చెందిన పంటలు ఎండిపోయే అవకాశమున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. మొదటి విడతగా రోజుకు 300 క్యూసెక్కుల చొప్పున 10 రోజులు 0.5 టీఎంసీ నీరు వదలాలని ఎమ్మెల్యే వేముల డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో ప్రభుత్వం నీళ్లు వదలకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పరీవాహక గ్రామాల రైతులతో కలిసి ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని హెచ్చరించారు.

'కాళేశ్వరం'పై విచారణకు నిపుణుల కమిటీ

- ఐదుగురు సభ్యులతో నియమించిన ఎన్‌డీఎస్‌ఏ
- చైర్మన్‌గా చంద్రశేఖర్ అయ్యర్
- 6న బరాజ్‌ల వద్దకు కమిటీ
- 3 బరాజ్‌లను పరిశీలించి లోపాలను గుర్తించాలి..
- పునరుద్ధరణకు సిఫారసులు చేయాలని దిశానిర్దేశం
- 4నెలల్లో పూర్తిస్థాయి నివేదికనివ్వాలని ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో లోపాలను గుర్తించి పునరుద్ధరణ చర్యలకు సిఫారసులు చేసేందుకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ)కు చెందిన ఐదుగురు సభ్యుల నిపుణుల కమిటీని కేంద్ర జల్‌శక్తిశాఖ నియమించింది. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మేడిగడ్డ బరాజ్‌లోని 20వ పిల్లర్ కుంగుబాటుకు గురవడం, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లో పలుచోట్ల నీటి బుంగలు ఏర్పడిన నేపథ్యంలో కారణాలను అన్వేషించి, తగిన సిఫారసులు చేయాలని కోరుతూ ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్‌కు తెలంగాణ ప్రభుత్వం గత నెల 13న లేఖ రాసింది. ఈ నేపథ్యంలో డ్యామ్‌సేఫ్టీ యాక్ట్ 2021లోని సెక్షన్ 8ని అనుసరించి ఎన్‌డీఎస్‌ఏ తాజాగా నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. కేంద్ర జల సంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్‌ను చైర్మన్‌గా, సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రిసెర్చ్ స్టేషన్ సైంటిస్ట్ యూసీ విద్యార్థి, సెంట్రల్ వాటర్, పవర్ రిసెర్చ్ స్టేషన్ సైంటిస్ట్ ఆర్ పాటిల్, సీడబ్ల్యూసీ బీసీడీ డైరెక్టర్ శివకుమార్ శర్మ, గేట్స్, సీడబ్ల్యూసీ, డిజాస్టర్ అండ్ రెసిలియెన్స్ డైరెక్టర్ రాహుల్ కుమార్‌సింగ్‌ను సభ్యులుగా నియమించింది.

కమిటీకి ఎన్‌డీఎస్‌ఏ మార్గదర్శకాలు..

- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించి, ప్రాజెక్టు స్థల సంబంధిత సమస్యలపై సమగ్ర అధ్యయనం కోసం సంబంధిత ఏజెన్సీలు, అధికారులతో చర్చించాలి. బరాజ్‌ల హైడ్రాలిక్, స్ట్రక్చరల్, జియోటెక్నికల్ అంశాలను నిర్ధారించాలి.
- ప్రాజెక్ట్ డాటా, డ్రాయింగ్‌లు, డిజైన్ మెమోరాండం, పరీక్షలు, సైట్ పరిశోధన నివేదికలు, బరాజ్ పోస్ట్, ప్రీ మాన్‌సూన్ తనిఖీ నివేదికలు, బరాజ్‌ల డిజైన్లు, నిర్మాణం, నాణ్యత, నియంత్రణ, ఇతర నివేదికలు, మెటీరియల్‌లను పరిశీలించాలి.
- సైట్ పరిశోధనలు, డిజైన్, నిర్మాణం, నాణ్యత నియంత్రణ, హామీ, ఆపరేషన్, మెయింటనెన్స్, నిర్వహణ, మూడు బ్యారేజీల సంబంధిత సమస్యలకు బాధ్యత వహించే సంబంధిత అధికారులు, ఏజెన్సీలతో చర్చించాలి.
- మూడు బ్యారేజీల రూపకల్పనలో సహాయం కోసం నిర్వహించిన భౌతిక/గణిత నమూనాలను అధ్యయనం చేయాలి.
- మేడిగడ్డ బరాజ్‌లో పిల్లర్ కుంగుబాటుకు దారితీసిన కారణాలను, గమనించిన ఇతర సమస్యలను పరిశీలించాలి. మిగిలిన రెండు అప్‌స్ట్రీమ్ బ్యారేజీల్లో గమనించిన సమస్యలకు కారణాలను గుర్తించాలి.
- మూడు బ్యారేజీల్లోని సమస్యలను పరిష్కరించడానికి, నివారించడానికి తీసుకోవాల్సిన, నిర్వహించాల్సిన తదుపరి అధ్యయనాలు/ పరిశోధనలను సిఫారసు చేయాలి. అటువంటి సమస్యలు పునరావృతం కాకుండా నిరోధించడానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించాలి.
- కమిటీ తన నివేదికను నాలుగు నెలల్లోగా ఎన్‌డీఎస్‌ఏకు సమర్పించాలి.

కమిటీకి సహకరిస్తాం: మంత్రి

కాళేశ్వరం బరాజ్‌ల పరిశీలనకు నిపుణుల కమిటీ ఈ నెల 6న రానున్నదని, వారికి అన్ని రకాలుగా సహకరిస్తామని రాష్ట్ర సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. నిపుణుల కమిటీ సూచనలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు.

మళ్లీ కాలయాపనే

నిరుడు అక్టోబర్ 24, 25 తేదీల్లో ఎన్‌డీఎస్‌ఏ బృందం మేడిగడ్డ బరాజ్‌ను సందర్శించి ప్రాథమిక నివేదిక ఇచ్చింది. వాస్తవంగా నేషనల్ డ్యామ్ సేఫ్టీ యాక్ట్ 2021 ప్రకారం దేశంలో ఏ ఆనకట్టకు ప్రమాదం వాటిల్లినా దాన్ని స్వాధీనం చేసుకునే అధికారం ఎన్‌డీఎస్‌ఏకు ఉన్నది. కానీ మేడిగడ్డ ఘటనపై ఎన్‌డీఎస్‌ఏ ఇప్పటికే 4 నెలలు జాప్యంచేసింది. ఎక్స్‌పర్ట్ కమిటీని వేయలేదు. ఇప్పుడు కమిటీని వేసినా మళ్లీ 4 నెలల్లో రిపోర్టు ఇవ్వాలనడం వెనక కుట్ర దాగి ఉన్నది. నాలుగు నెలల గడువుతో ఈ సీజన్‌లో రిపేర్లు చేయడం అసాధ్యం. వరదలు వస్తే బరాజ్‌కు మరింత నష్టం వాటిల్లే ప్రమాదముంది. ఇతర బ్లాక్‌లు కూడా ప్రభావితమయ్యే అవకాశముంది. అందుకు కేసీఆర్‌ను బద్నాం చేయడమే లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి సర్కార్ వ్యవహరిస్తున్నది

- వీ ప్రకాష్, మాజీ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర జలవనరుల అభివృద్ధి కార్పొరేషన్

- ఆకేరుకు నాడు జలకళ .. నేడు వెలవెల

2023

2024

మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల కేంద్రం శివారులో ఉన్న ఆకేరు వాగు నీటి ప్రవాహం లేక నేడు వెలవెలబోతున్నది. రెండు పంటలకు సమృద్ధిగా నీరందించే ఆకేరు కళ తప్పడంతో శివారు రైతులు ఆందోళన చెందుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోని చెరువులు, కుంటల్లో కాళేశ్వరం జలాలు చేరి ఏ గ్రామంలో చూసినా నీరు పుష్కలంగా ఉండేది. దీంతో భూగర్భ జలాలు పెరిగి ఆకేరువాగు ఆనకట్టపై మే నెలలో సైతం మత్తడి దుంకేది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఆకేరు ఎండిపోయి ఉండటంతో రైతులు దిగాలు చెందుతున్నారు. పదేండ్లుగా ఆకేరుకు ఎన్నడూ ఇలాంటి పరిస్థితి దాపురించలేదని మండల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. - చిన్నగూడూరు

కుంగిన పిల్లర్ వద్దకు వరద

- మేడిగడ్డలో కానరాని అప్రమత్తత
- అధికారుల నిర్లక్ష్యంపై అనుమానాల వెల్లువ
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ప్రస్తుతం కుంగిన పిల్లర్ల వద్దకు భారీగా చేరుతున్న వరదనీరు

మహదేవపూర్, మార్చి 3: కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌లో కుంగిన పిల్లర్ల వద్దకు మళ్లీ భారీగా వరద వచ్చి చేరుతున్నది. ముందస్తు చర్యలు పాటించడంలో అధికారులు తరచూ విఫలం కావడంపై ప్రజలు, రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరి 18న అన్నారం బరాజ్ గేట్లు ఎత్తడంలో గోదావరి, మహారాష్ట్ర ప్రాణహిత నదితో కలిసి మేడిగడ్డ బరాజ్‌కు సుమారు 19 వేల క్యూసెక్కుల వరద పోటెత్తింది. భారీ వరద నీరు కుంగిన పియర్ల చుట్టూ చేరితే మరింత ప్రమాదం జరిగే అవకాశం ఉన్నదని తెలిసీ కూడా సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడంపై అనేక విమర్శలు వెల్లువెత్తాయి. ఈ విషయంలో అధికారుల నిర్లక్ష్యం, ముందస్తు చర్యలను గాలికొదిలేసిన తీరుపై కండ్లకు కట్టినట్టు ఇటీవల 'నమస్తే తెలంగాణ'లో ప్రధాన వార్తగా ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై సంబంధిత అధికారులు వరద తగ్గాక నీటి మళ్లింపునకు తూతూ మంత్రంగా చర్యలు చేపట్టడంపై ప్రజలు, మేధావులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. నష్ట నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం అనేక అనుమానాలకు తావిచ్చింది. మార్చి ఒకటిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ చలో మేడిగడ్డ కార్యక్రమం నేపథ్యంలో అధికారులు హడావిడిగా బరాజ్‌లో కుంగిన పిల్లర్ల వద్ద ఉన్న వరద నీరు, ఇసుక, బురద, మట్టిని పూర్తిగా తొలగించారు. మేడిగడ్డను పరిశీలించిన కేటీఆర్ బృందం బరాజ్‌లో ఏర్పడిన సమస్యలను నిపుణులతో గుర్తించి వెంటనే పూర్తి స్థాయిలో మరమ్మతు పనులు ప్రారంభించి బరాజ్‌ను పునరుద్ధరించి రైతులకు నీళ్లు ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. బరాజ్‌పై రాజకీయం చేయొద్దని, రైతులను పగ పట్టొద్దని బరాజ్‌లో రిపేర్లు చేసి రాష్ట్రానికి కల్పతరువుగా ఉన్న మేడిగడ్డను వినియోగంలోకి తేవాలని తెలిపిన విషయం తెలిసిందే. కేటీఆర్ మేడిగడ్డ పర్యటన నేపథ్యంలో హడావిడి పనులు చేసి వరద రాకుండా చేసిన అధికారులు మరుసటి రోజునుంచి బరాజ్ వైపు వస్తున్న వరదను కట్టడి చేయకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బరాజ్‌లోని ఏడో బ్లాక్‌లో కుంగిన 19,20,21వ పిల్లర్ల వద్దకే ఆదివారం మళ్లీ భారీగా వరద వచ్చి చేరింది. పెద్ద మొత్తంలో వరద నీరు వచ్చి చేరుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. కొంతకాలంగా బరాజ్ వద్ద జరుగుతున్న పనుల తీరు, తాజా పరిస్థితులు గమనిస్తే అధికార యంత్రాంగం కావాలనే బరాజ్‌ను గాలికొదిలేసి నష్టాన్ని మరింత పెరిగేలా చేస్తున్నదా? అనే అనుమానాలు రైతులు, ప్రజల్లో వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు బరాజ్‌పై కుట్రలు మానుకొని పూర్తి స్థాయిలో మరమ్మతు పనులు చేపట్టి ఆదుకోవాలని రైతులు, ప్రజలు వేడుకుంటున్నారు.

ఇసుక కదలడం వల్లే..

మొదటిపేజీ తరువాయి...

విశ్వసనీయ సమాచారం. అందుకు సంబంధించిన నివేదికను వారం క్రితమే సిద్ధం చేసిన సదరు ఏజెన్సీ దానిని ప్రభుత్వానికి నివేదించేందుకు ససేమిరా అంటున్నట్టు తెలుస్తున్నది. ఏజెన్సీ నుంచి నివేదికను తెప్పించుకోవడంతోపాటు తదుపరి పరీక్షలను నిర్వహించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనబడుతున్నది.

పూర్తయిన ఈఆర్‌టీ, జీపీఆర్ టెస్టులు

20వ పిల్లర్ కుంగుబాటుకు కారణాలపై ఇన్వెస్టిగేషన్ ప్రక్రియను నిర్మాణ ఏజెన్సీ ఎల్ అండ్‌టీనే చేపట్టింది. ఇందులో భాగంగా తొలుత విద్యుత్తు నిరోధకత ఆధారంగా భూగర్భ పరీక్షలను నిర్వహించే ఈఆర్‌టీ (ఎలక్ట్రోడ్ రెసిస్టివిటి టెస్ట్)ను చేపట్టింది. విద్యుత్తు ప్రవాహం అన్ని పదార్థాల్లో ఒకే విధంగా ఉండదు. ఇసుకలో, నీళ్లలో, ఒక్కో తీరుగా, ఒక్కో వేగంతో ప్రవహిస్తుంది. కొన్ని మూలకాల గుండా విద్యుత్తు అసలే ప్రవహించదు. కొన్నింటి ద్వారా వేగంగా, కొన్నింటి ద్వారా నిదానంగా ప్రవహిస్తుంది. ఇలా విద్యుత్తు ప్రవాహాన్ని బట్టి భూగర్భంలో ఎలాంటి పదార్థమున్నది తెలుసుకోవచ్చు. అదే పద్ధతిని అనుసరించి బరాజ్ ఫౌండేషన్‌ను అధికారులు పరీక్షించారు. అదేవిధంగా భూగర్భ భౌతిక స్థితిని తెలుసుకునేందుకు గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడర్‌టెస్ట్ (జీపీఆర్)ను నిర్వహించారు. భూగర్భంలో ఉన్న వివిధ మట్టి పొరలు, పదార్థాల లక్షణాలు, సంభవించిన మార్పులు, పగుళ్లు, శూన్యాలను తెలుసుకొనేందుకు దీనిని నిర్వహిస్తారు. ప్రస్తుతం 7వ బ్లాక్‌లో ఈ రెండు టెస్టులను పూర్తిచేశారు. 6వ బ్లాక్‌లోనూ చేపట్టేందుకు నిర్మాణ ఏజెన్సీ సిద్ధమైంది.

నివేదికను ఇచ్చేందుకు ససేమిరా!

7వ బ్లాక్‌కు సంబంధించి ఈఆర్‌టీ, జీపీఆర్ టెస్టులను నిర్వహించడమే గాక అందుకు సంబంధించిన నివేదికను సైతం బరాజ్ నిర్మాణ ఏజెన్సీ ఎల్‌అండ్‌టీ సిద్ధం చేసిందని విశ్వసనీయ సమాచారం. బరాజ్‌లోని పిల్లర్ కుంగుబాటునకు ప్రధానంగా పిల్లర్ దిగువన ఇసుక పూర్తిగా కదిలిపోవడమే కారణమని నిర్ధారించినట్టు తెలిసింది. సాధారణంగా అంతర్గత జల ప్రవాహం వల్ల బరాజ్ ఫౌండేషన్ కింద ఉన్న మట్టి కొట్టుకుపోకుండా ఉండేందుకు సెకంట్‌పైల్స్‌ను రక్షణగా ఏర్పాటుచేస్తారు. అంతర్గత జల ప్రవాహాన్ని దారి మళ్లిస్తారు. సెకంట్‌పైల్స్‌ను నిట్టనిలువుగా అమర్చాల్సి ఉంటుంది. అయితే 7వ బ్లాక్ 20వ పిల్లర్ వద్ద ఏర్పాటుచేసిన పలు సెకంట్‌పైల్స్‌లో వాటిల్లిన లోపం వల్లేనే నీటి ప్రవాహం ఫౌండేషన్ కిందుగా కొనసాగి, ఇసుకను, మట్టిని తోడేసిందని, తద్వారా ఖాళీ ఏర్పడి పిల్లర్ కుంగుబాటునకు గురైందని సమాచారం. ఈఆర్‌టీ, జీపీఆర్ టెస్టులో అదే నిర్ధారణకు వచ్చిందని తెలుస్తున్నది. అయితే అందుకు సంబంధించిన నివేదికను సదరు నిర్మాణ ఏజెన్సీ ఇప్పటికీ ప్రభుత్వానికి ఇవ్వలేదని అధికారులు చెప్తున్నారు. ఇదిలా ఉంటే ఫౌండేషన్‌లో అంతర్గతంగా నీటి ప్రవాహం కొనసాగడం వల్ల పిల్లర్ కుంగుబాటుకు గురైన నేపథ్యంలో 7వ బ్లాక్‌కు సంబంధించిన ఫౌండేషన్‌ను పూర్తిగా పరీక్షించాల్సి ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. అంతర్గతంగా వాటర్ పైపింగ్ ఎక్కడి నుంచి మొదలై, ఎక్కడికి వెళ్తున్నది గుర్తించాల్సి ఉన్నదని అధికారులు, నిపుణులు చెప్తున్నారు. అందుకు 7వ బ్లా